లోకేష్ చేతులమీదుగా అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి శంకుస్థాపన

విశాలాంధ్ర-యలమంచిలి : రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి లోకేష్ చేతులమీదుగా అచ్యుతాపురం అనకాపల్లి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయని రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. సుమారు 368 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఈ రహదారి నిర్మాణానికి మంత్రి లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నేతలతో మంత్రుల లోకేష్ 3 గంటలపాటు సమావేశం నిర్వహించి నాయకులు కార్యకర్తలు అభిప్రాయాలను తెలుసుకుంటారన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం వచ్చేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి వచ్చే నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో మెలగాలని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జి నానాజీ, కార్యదర్శి ఆడారి రమణబాబు, గ్రామీణ అధ్యక్షులు ఇతంశెట్టి రాజు, టిడిపి సీనియర్ నాయకులు కొలకలూరు విజయబాబు, కొట్టారు సాంబ, రాజన్న నారాయణమ్మ, ఆడారి ఆదిమూర్తి, సురకాసుల రమణ బాబు, కరణం రవి, సర్పంచ్ సన్యాసినాయుడు, పందూరి శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హత గల వారందరికీ ఉద్యోగాలు : ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర- కే.కోటపాడు : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం స్థానిక అయ్యన్న విద్యాసంస్థల ప్రాంగణంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన జాబ్ మేళాను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల నెలకొల్పిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. ఇప్పటికే అనేక కంపెనీల్లో ప్రతిభ గల నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారని అన్నారు. ఉద్యోగాలు రానివారు ఎవరు నిరుత్సాహ పడవద్దని వారందరికీ ఆయా రంగాల్లో మరింత నైపుణ్యత సాధించేలా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కే కోటపాడు లో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తాను అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు మాట్లాడుతూ నేడు ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో 17 కంపెనీలు పాల్గొనగా అత్యధిక శాతం ఫార్మా కంపెనీలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు ఎనిమిది వందల మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అన్నారు. త్వరలో మరో 25 కంపెనీలతో మాట్లాడుతున్నామని కే కోటపాడు లోనే భారీ జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ పివిజి కుమార్ సభ్యుడు రొంగలి మహేష్ మాజీ సర్పంచ్ దోకల లక్ష్మీనరసింహ మూర్తి అయ్యన్న విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1న పదవ తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష

పదవ తరగతి ఒకేషనల్ పరీక్షలకు 4803 మంది హాజరు

జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి : జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో భాగంగా ఒకేషనల్ ఎడ్యుకేషన్ పరీక్షలు శనివారం 29 పరీక్షా కేంద్రాలలో నిర్వహించబడ్డాయని, 4999మంది విద్యార్థులకు గాను 4803మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, 96 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సాంఘిక శాస్త్రం పరీక్ష ఏప్రిల్ 1న యధావిధిగా ఉదయం 9:30 నుంచి 12:45 గంటల వరకు జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. రంజాన్ పర్వదినం ఈ నెల 31వ సోమవారం జరుగుతున్నందున పరీక్షను మంగళవారం నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించి, ఆదేశాలు జారీ చేసిందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ మార్పును గమనించాలని ఆయన ప్రకటనలో కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి వారి వెబ్ సైటు ను (deoakp.com) ను ప్రారంభించినట్లు ఆయన తెలియజేసారు. అనకాపల్లి జిల్లాకు సంబందించిన వివరములను సంబందిత సైటు నందు ఉపాధ్యాయుల సౌకర్యార్థం ఉంచడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి తెలియజేసారు.

సర్వసిద్ధి పిహెచ్‌సిని డిఎం అండ్ హెచ్‌ఓ తనిఖీ

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.రవికుమార్ తనిఖీ చేశారు. శనివారం ఉదయం ఆరోగ్య కేంద్రం ను సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇచ్చే మందులు సరిపడా ఉన్నాయా లేవా అనే దానిపై ఆరా తీసి పరిశీలించారు. ల్యాబ్ లో పరీక్ష సంబంధించి వివరాలపై చర్చించారు. కర్రివానిపాలెం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వద్దకు వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఎన్. వాసంతి, సిహెచ్. దీపిక తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు గౌరవప్రదంగా పెన్షన్ అందజేయాలి

ఎంపీడీవో దెందుకూరు సీతారామరాజు

విశాలాంధ్ర-నక్కపల్లి : మండలంలో ఏప్రిల్ ఒకటో తేదీని 100% పెన్షన్ పంపిణీ చేయాలని పెన్షన్ దారులకు గౌరవప్రదంగా పెన్షన్ పంపిణీ చేయాలని కార్యదర్శులకు ఎంపీడీవో దెందుకూరు సీతారామరాజు ఆదేశించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటినే పెన్షన్ దారులకు 100% పెన్షన్ పంపిణీ చేయాలని అన్నారు. పెన్షన్ తాలూకా సొమ్ము శనివారం డ్రా చేయడం లేదని డ్రా చేసిన మొత్తాన్ని పోలీస్ స్టేషన్ లో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 31న మధ్యాహ్నం రెండు గంటలకు పింఛనీ సొమ్మును పోలీస్ స్టేషన్ నుండి ఎంపీడీవో కార్యాలయం కార్యదర్శులు తీసుకొని వచ్చి తీసుకొని ఏప్రిల్ 1న పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ దారులకు నమస్కారం చేసి వారితో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని వాయిస్ మెసేజ్ వినిపించాలని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

జిల్లా రగ్బీ గౌరవ అధ్యక్షులు కూండ్రపు వెంకునాయుడు

విశాలాంధ్ర-అచ్యుతాపురం : యువత చదువుతోపాటు క్రీడలలో రాణించి గ్రామీణ ప్రాంతాల నుండి జాతీయ స్థాయికి ఎదగాలని జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షులు కూండ్రపు వెంకునాయుడు అన్నారు. రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనేందుకు అనకాపల్లి జిల్లా సీనియర్ కేటగిరి జట్టును శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ గ్రౌండ్ లో ఎంపిక చేశారు . పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను నేషనల్ కోచ్ వెంకట్ జిల్లా జట్టుకు ఎంపిక చేశారు . వీరంతా అనంతపురం జిల్లాలో ఏప్రిల్ 14, 15 తేదీన డిటిసి పోలీస్ గ్రౌండ్ , అనంతపురం జిల్లాలో జరగబోతున్న రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్నారని అసోసియేషన్ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ ఎస్ ఎన్వి జగదీష్, కోశాధికారి కూండ్రపు రమేష్ , పైలా అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన వైస్ ఎంపీపీ శరగడం లక్ష్మిని అభినందించిన మాజీ మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం మండల పరిషత్తు కార్యాలయంలో జరిపిన వైస్ ఎంపీపీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అంబేరుపురం ఎంపీటీసీ శరగడం లక్ష్మీ శ్రీనివాసరావు మాజీ మంత్రి, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గం వైసిపి ఇన్చార్జ్ గుడివాడ అమర్నాథ్ అభినందించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం జరిపిన ముఖ్య నేతల సమావేశంలో మాజీ మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ 9నెలల కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు విసిగిపోయారని అన్నారు. ప్రభుత్వ పథకాలు అన్ని గతంలో కంటే మెండుగా ఇస్తామని, సూపర్ సిక్స్ పథకాలని, ఒక్కసారి అవకాశం ఇవ్వమంటూ నమ్మబలికిన సీఎం చంద్రబాబు ప్రజల్ని మరోసారి మోసం చేశారని తెలియజేశారు. భవిష్యత్తులో ఎన్నడు నమ్మని అబద్ధాలు ఆడటం సీఎం చంద్రబాబు కే సాధ్యమైందని తెలిపారు. చోడవరం మండల పరిషత్ కు వైస్ ఎంపీపీగా వైసిపి అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు వైసీపీ నేతలు దొడ్డి వెంకటరావు డివిఆర్ ఓరుగంటి నెహ్రూ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా నూకాలమ్మ తల్లి పండగ

విశాలాంధ్ర-నక్కపల్లి : మండలంలో కొత్త అమావాస్య సందర్భంగా పలు గ్రామాల్లో నూకాలమ్మ వారి పండగను ఘనంగా నిర్వహించారు. పూర్వం నుంచి ఆచార సంప్రదాయాలతో గ్రామ దేవతల పండగను అమావాస్య రోజున భక్తిశ్రద్ధలతో పూజిస్తుంటారు. ఈ మేరకు నక్కపల్లి నూకాలమ్మ తల్లి సంబరాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడిన రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోండి

ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ డిమాండ్

విశాలాంధ్ర-గొలుగొండ : మీడియాలో వస్తున్న వరుస కథనాలను ఆధారంగా చేసుకొని శనివారం ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ ప్రతినిదులు బి.శివ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవసరాల దేవి, రాష్ట్ర కోశాధికారి, జోగ ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు మండలంలో పాత మల్లంపేట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ,సీనియర్ న్యాయవాది బి.శివ మీడియాతో మాట్లాడారు. ఫిబ్రవరి 24వ తేదీన గొలుగొండ మండలం తాసిల్దార్ సర్వే నంబర్ 850-1 లో సుమారుగా 5 నుండి 5 కోట్ల రూపాయల విలువైన భూమిని దుగ్గిరాల బాలకృష్ణ పేరుతో మార్పులు చేశారు. ఈ మార్పులు చట్ట విరుద్ధమని మా పరిశీలనలో తేలింది. ఈ భూమిని సందర్శించగా అందులో ఆదివాసీల సాగు అనుభవం స్పష్టంగా కనిపిస్తున్నది. ఆదివాసీల సాగు అనుభవంలో ఉన్నప్పటికీ దుగ్గిరాల బాలకృష్ణ ఈ భూమిని సాగు చేస్తున్నట్లుగా గ్రామ పరిపాలన అధికారి, రెవిన్యూ ఇన్స్పెక్టర్లతో దొంగ రిపోర్టులు తయారు చేయించి ప్రస్తుత తాసిల్దార్ ఈ మార్పులు చేశారని, ఈ మార్పులు చట్టపరంగా చెల్లవని ఈ సందర్భంగా వారు అన్నారు. గ్రామ పంచాయతీకి సమాచారం గానీ నోటీసు గానీ ఇవ్వకుండా, సాగు అనుభవంలో ఉన్నవారికి తమ వాదనలు వినిపించుకునే అవకాశం ఇవ్వకుండా రికార్డుల మార్పు చేయడం సహజ న్యాయ సూత్రాలకు గతంలో భారత సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధమని ఆయన అన్నారు. దుగ్గిరాల బాలకృష్ణ సంతకం చేసిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జిపిపి)ను పరిశీలించామని, అందులో నాలుగు సంతకాలు ఉన్నాయని, వారందరికీ అమెరికా దేశపు పాస్ పోర్ట్ , చిరునామాలు ఉన్నాయని ఆయన అన్నారు. అమెరికాలో ఉంటున్న వారు పాత మల్లంపేటలో వ్యవసాయం ఎలా చేస్తున్నారో తాసిల్దార్ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 2023వ సంవత్సరం జనవరి నెలలో నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్కు రాసిన రిపోర్టర్ ను తమ పరిశీలించామని అందులో జి ఏ పి హెూల్డ్ ర్ ఒక్క లంక సుధాకర్ గాని అతని కుటుంబ సభ్యులు గాని సాగులో లేరని ఆదివాసీలే సాగులో ఉన్నారని అంగీకరించారని శివ అన్నారు. 2022వ సంవత్సరంలో ఒక్క లంక సుధాకర్ సాగులో లేకపోతే అతనికి జిపిపి రాసి ఇచ్చిన వారిలో ఒకరైన దుగ్గిరాల బాలకృష్ణ ఎలా సాగులోకి వచ్చాడో రెవిన్యూ అధికారులు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది పూర్తిగా అవినీతి, అధికార దుర్వినియోగంతో చేసిన చర్యని స్పష్టంగ కనిపిస్తున్నదని, కానీ ఇప్పటి వరకు జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని ఆయన అన్నారు. పాత మల్లంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ ఆదిలక్ష్మి ఆదివాసీల సాగు అనుభవాన్ని ధ్రువీకరించారని, తమ పంచాయతీ కార్యాలయానికి రెవెన్యూ అధికారులు ఎటువంటి సమాచారం నోటీసులు ఇవ్వలేదని వారు తెలియజేసారని శివ అన్నారు. శాసనసభ స్పీకర్ ప్రాథమిత్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గంలో ఆదివాసీలకు ఇంత అన్యాయం జరుగుతుంటే స్థానిక శాసనసభ్యులు స్పందించకపోవడం విచారకరమైన కూడా ఆయన అన్నారు. తక్షణం ఒక ఉన్నత స్థాయి విచారణ కమిటీని వేయాలని, ప్రస్తుత తాసిల్దార్, గ్రామ రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తమ పరిశీలనను ఒక నివేదికగా జిల్లా యంత్రాంగానికి , రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని అప్పటికి వారి నుండి స్పందన లేకపోతే న్యాయపోరాటంలో ఆదివాసీలకు అండగా ఉంటామని శివ అన్నారు.

నిరుద్యోగ యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన

విశాలాంధ్ర-సబ్బవరం : మార్చ్ 29.మండలంలోని దేవిపురం గ్రామం దరి ఉన్న డాన్ బాస్కో టెక్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు స్కిల్ డెవలప్మెంట్ పై పలు కోర్సులలో ఉచితంగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు డాన్ బాస్కో టెక్ ఫీల్డ్ ఆఫీసర్ జె రాజు పియల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31నుండి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ ఛదువుకున్న విద్యార్థిని, విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశం అని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని దూరప్రాంతాలలో నుండి వచ్చి ఉచిత స్కిల్ డెవలప్మెంట్ కోర్సులలో శిక్షణ పొందాలనుకుంటున్న వారికి వేరే సంస్థ వారు ఇదే ప్రాంగణంలో అతి తక్కువ ఫీజులతో హాస్టల్ వసతులతో కల్పిస్తున్నారు. కావున ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు మీ పేర్లను నమోదు చేసుకొని ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్ 7330821028 సంప్రదించాలని కోరారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నూకాలమ్మ ఆలయంలో ప్రసాదం వితరణ

విశాలాంధ్ర-చోడవరం : కొత్త అమావస్య, ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీనూకాలమ్మ పండుగ సందర్భంగా శనివారం ఆలయంలో భక్తులకు చోడవరం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సుమారు 2000 మంది భక్తులకు ఏ.టి.సి. వి.కిరణ్, ఎం.గుప్తా ఆర్థిక సాయంతో చక్రపొంగలి ప్రసాదంగా ఇవ్వడం జరిగిందని నిర్వాహకులు తెలియజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సి.ఎం.ఆర్. ఇంచార్జ్ సత్యవరపు శ్రీనివాస్, జెడ్.సి. కొల్లూరు మణికుమార్, క్లబ్ అధ్యక్షుడు పెన్నం రాజు, సెక్రటరీ విన్నకోట రాజేష్, ట్రెజరర్ అత్రేపు శ్రీనివాస్ ఇమీడియట్ ఫాస్ట్ ప్రెసిడెంట్ పూసర్ల కిరణ్, వి కే ఎస్ పి ఇన్చార్జ్ బత్తుల శ్రీనివాస్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు మాయం

విశాలాంధ్ర-పరవాడ : పరవాడ మండలం పెదముషిడివాడ పంచాయతీలో ఇటీవల ఏర్పాటు చేసిన రెవెన్యూ హెచ్చరిక బోర్డు మాయమైంది. సర్వే నెంబర్ 379లో భూస్వామ్ గెడ్డ ఆక్రమణకు గురవుతుండగా.. స్థానికుల పిర్యాదుతో రెవెన్యూ సిబ్బంది ఈ నెల 24వ తేదీన అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసారు. దీంతో పాటు అదే రోజు సర్వే నెంబర్ 152 గెడ్డ స్థలంలోనూ, సర్వేనెంబర్ 378 ప్రభుత్వ స్థలంలోనూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసారు. అయితే వారం రోజులు తిరగక ముందే అక్రమార్కులు సర్వే నెంబర్ 379లో గల భూస్వామ్ గెడ్డలో హెచ్చరిక బోర్డు(ఫ్లెక్సీ)ను ధ్వంసం చేశారు. అయితే అధికారుల మొక్కు బడి చర్యల కారణంగానే అక్రమార్కులు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే కఠిన చర్యలు తీసుకొని ఉంటే అక్రమార్కులు ఇలాంటి బరితెగింపులకు పాల్పడి ఉండేవారు కాదని, ఇప్పటికైనా అక్రమార్కులపై ల్యాండ్ గ్రాభింగ్ కేసులుపెట్టి మరోసారి ఇలా అవ్వకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేద బడుగు బలహీన వర్గాలకు టీడీపీతోనే మేలు

విశాలాంధ్ర-మునగపాక: పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు టీడీపీ తోనే మేలు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ పేర్కొన్నారు. శనివారం జరిగిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మెయిన్ రోడ్డులో వున్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ వల్లే పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు జరుగు తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దాడి మునిలినాయుడు, దొక్కా నాగభూషణం, మొల్లేటి సత్యనారాయణ, దాడి శివ, దాడి అప్పలనాయుడు, విల్లూరి నర్సింగరావు, పెంటకోట శ్రీరామ్మూర్తి, భీశెట్టి నాగేశ్వరావు, బీలా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం జెండా... నిరుపేదలకు అండ

మండలంలో నాగులాపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ జెండాను ఆవిష్కరించి, అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.తిమ్మరాజుపేట గ్రామంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ జెండాను ఎగురవేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. వాడ్రాపల్లి గ్రామంలో తెలుగురైతు జిల్లా కన్వీనర్ మళ్ల వరహా నరసింగరావు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

క్వారీ, క్రషర్లపై నిఘా ఉంచాలి

రూరల్ పోలీసులకు ఎస్పీ ఆదేశం

విశాలాంధ్ర-అనకాపల్లి: మైన్స్, విజిలెన్స్ అధికారులుతో తరచూ క్వారీలను, క్రషర్ లను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీస్ స్టేషన్ అధికారులను ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా, స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం తప్పనిసరి అని అధికారులకు సూచించారు. పెండింగ్ లో ఉన్న కేసుల సీడీ ఫైళ్లను సమీక్షించి, వాటి పురోగతిని విశ్లేషించారు. అదేవిదంగా 2020 కన్నా ముందు ఉన్న పాత కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా బొజ్జన్న కొండ రూట్ లో వాహనాలు క్రమబద్ధీకరణకు, వాహనాల నియంత్రణకు సిబ్బందిని నియమించాలని సూచించారు. అలాగే, స్టేషన్లోని సీసీ టీవీ కెమెరాలు పర్యవేక్షించి పూర్తిగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, రోడ్డు ప్రమాదాలు, నేరాలకు ఆస్కారం ఉన్న ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించి, తమ స్వంత ప్రాంగణాల్లో సీసీటీవీ కెమెరాలు అమర్చుకునేలా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. అనుమతిలేని బహిరంగ మద్యం సేవనాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడిపే వ్యక్తులపై ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రౌడీ షీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులను కౌన్సిలింగ్ చేయడంతోపాటు, వారి ప్రవర్తనపై నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు రాత్రి, పగలు గస్తీలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం, పోలీస్ స్టేషన్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.అశోక్ కుమార్, ఎస్సై జి.రవికుమార్, ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.

అనకాపల్లి-అచ్చుతాపురం రోడ్డు నేటికీ ఆర్ అండ్ బి పరిధిలో వుంది

- గ్రామీణ ప్రాంతాలలో రైతులు ఒప్పుకోకుంటే టీడీఆర్ బాండ్లు ఎందుకు

- నిర్వాసితులతో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

విశాలాంధ్ర-మునగపాక: గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆయాయంలో అనకాపల్లి- అచ్చుతాపురం రోడ్డు గోతుకుల మాయమై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనడంతో ఆనాడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వీఎంఆర్డిఏ పరిధిలో నిధులను ఆర్ అండ్ బి పరిధిలోకి మళ్లించి అనకాపల్లి అచ్యుతాపురం రోడ్డును అభివృద్ధి చేశారని ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే విజయ్ కుమార్ గమనించలేదా అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక పిఎసిఎస్ భవనం వద్ద అనకాపల్లి అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు భవనాలు కోల్పోతున్న నిర్వాసితులతో అఖిలపక్ష సమావేశం శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ ఆర్ అండ్ బి పరిధిలోనే అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు ఉందని నిర్వాసితులను మభ్యపెట్టి వీఎంఆర్డిఏ పరిధి అంటూ రాష్ట్రం మొత్తం మీద గ్రామీణ ప్రాంతాలలో నేటికీ ఎక్కడ పంపిణీ చేయలేని టిడిఆర్ బాండ్లు అంటూ ఎమ్మెల్యే చెప్పడం నిర్వాసితుల పట్ల అతని చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు.ఈ రోడ్డు ఆర్ అండ్ బి పరిధిలోనే ఉందని దానిని నిరూపించేందుకు నేను సిద్ధమని దీనికి మీరు సిద్ధమేనా అని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధికి నిర్వాసితులు వ్యతిరేకం కాదని అయితే గ్రామీణ ప్రాంతమైన ఈ రోడ్డు విస్తరణ బాధితులకు టిడిఆర్ బాండ్లు ఇచ్చి వాళ్ళ కుటుంబాలను రోడ్డుపాలు చేయడం మీకు తగునా అన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెడతా అంటూ బెదిరించడం మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మంచి మనసుతో బాధితులకు నగదురుపేనా చెల్లింపులు జరిపేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వారిని సంతోషపరిచే విధంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈనెల 31వ తేదీన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఫ్లైఓవర్ నిర్మాణానికి భూమి పూజ చేసేందుకు విచ్చేస్తున్నందున నేడు ఏర్పాటైన నిర్వాసితులు జేఏసీ కమిటీ సభ్యులను ఆయన వద్దకు తీసుకువెళ్లి వారి గోడును వివరించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. రోడ్డు విస్తరణలో సుమారు 1200 మంది నిర్వాసితులు తమ విలువైన భూములు,భవనాలు కోల్పోతున్నప్పటికీ అభివృద్ధికి ఆటంకం కాకూడదని ముందుకు వచ్చారని అయితే 1200 మంది నిర్వాసితులు కుటుంబానికి నలుగురు చొప్పున చూసుకున్న సుమారు నాలుగు వేల ఎనిమిదివందల మంది జీవితాలు పిడిఆర్ ప్రకటనలతో రోడ్లు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. నగదు చెల్లింపులకు ఒప్పించిన అనకాపల్లి, అచ్యుతాపురం, మునగపాక ఎమ్మార్వోలు, ఆర్డిఓ, జిల్లా కలెక్టర్ ఈ విషయం పై దృష్టి సారించి నిర్వాసితులకు అండగా నిలిచి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి నగదు చెల్లింపులు జరిపే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. లేకుంటే పార్టీలకు అతీతంగా నిర్వాసితులకు అండగా అందరూ నిలవాలని అన్నారు. బాధితులకు నగదు చెల్లింపులు చేసి ఆదుకోకుంటే ఏర్పాటైన జేఏసీ సభ్యులు ఏ పోరాటానికి అయినా సిద్ధంగా ఉన్నారని సూచించారు. ప్రభుత్వం,స్థానిక ఎమ్మెల్యే రోడ్డు విస్తరణ పై చితశుద్ధి ఉంటే వెంటనే నగదు చెల్లింపులు చేసి విస్తరణ పనులు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు, తిమ్మరాజుపేట గ్రామ ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, మూలపేట గ్రామ సర్పంచ్ బిశెట్టి గంగ అప్పలనాయుడు,రోడ్డు విస్తరణలో భూముల్లో భవనాలు కోల్పోతున్న నిర్వాసితులు పాల్గొన్నారు.

పంచాయతీలో సంతలు ఆశీలు వేలం పాట

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం మేజర్ పంచాయితీలోగల రోజువారి, వారపు సంత లకు శనివారం పంచాయితీ అధికారులు ఆశీలు వేలంపాట నిర్వహించారు. ఈ.ఓ.ఆర్డి ఓ.మహేష్, పంచాయతీ ఈ. ఓ. నారాయణ రావు ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరంకు గాను నిర్వహించిన వేలం పాట లో చోడవరం కు చెందిన ఖండెల్లి వరప్రసాద్ 3లక్షల 61వేల రూపాయలకు పాడుకున్నట్లు అధికారులు తెలియ జేశారు. గత ఏడాది మూడు లక్షలు 40 వేల రూపాయలకు వెళ్లినట్లు వారు తెలిపారు. సంతల ఆశీలు వసూలు 2025 ఏప్రియల్ ఒకటవ తేదీ నుండి 2026 మర్చి 31 వరకు అమల్లో వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఈఓఆర్డి మహేష్, పంచాయతీ కార్యదర్శి నారాయణరావు, గ్రామ సర్పంచ్ బండి నూకాలమ్మ, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల ఈ కెవైసీ గడువు పెంపు

విశాలాంధ్ర-చోడవరం : రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్నవారు ఈ-కేవైసీ చేయించుకునే గడువును అధికారులు పొడిగించారు. ఈనెల 31తో ముగియనుండగా దాన్ని ఏప్రిల్ 30 వరకు పెంచారు. దీంతో ఇప్పటివరకు ఈ-కేవైసీ పూర్తి చేయనివారు వెంటనే చేసుకోవాలని అధికారులు సూచించారు. మరోసారి గడువు పెంచే అవకాశం ఉండకపోవచ్చని పేర్కొన్నారు.

పాల్తేరులో తాగునీటి సమస్య పరిష్కరించాలి : సర్పంచ్, ఎంపిటిసిలు

-తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను పంచాయతీ కార్యదర్శి పరిశీలన

-విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-పాయకరావుపేట : మండలంలోని పాల్తేరు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ గోసల కృష్ణ, ఎంపిటిసిలు ఇసరపు సత్యనారాయణ, మాకినీడి చిట్టిబాబు మండల పరిషత్ సమావేశంలో ఎంపిడిఓ జయప్రకాశరావుకు వినతిపత్రం అందజేశారు. పాల్తేరులో దాహం కేకలు అనే వార్త విశాలాంధ్రలో ప్రచురితమైంది. దీనిపై జిల్లా అధికారులతో పాటు, ఎంపిడిఓ జయప్రకాశరావు, ఈఓపీఆర్డి సీహెచ్ చంద్రశేఖర్‌రావు స్పందించారు. తాగునీటి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఫణి వర్మ, పంచాయతీ కార్యదర్శి ఆచారికి ఆదేశాలు జారీ చేశారు. అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఆచారి పాల్తేరు గ్రామంలో పర్యటించారు. తాగునీరు సరఫరా కాని ప్రాంతాలను పరిశీలించారు. జల జీవన్ మిషన్ పనులు కారణంగా తాగునీటి సమస్య ఏర్పడిందని గుర్తించి, ప్రజలకు వివరించారు. తాగునీరు సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విశాలాంధ్ర పేజి : 2
అనకాపల్లి
ఆదివారం 30, మార్చి 2025

పంచాయితీ నిధులతో అత్యవసర అభివృద్ధి పనులు : సర్పంచ్ లోచల సుజాత

విశాలాంధ్ర-గొలుగొండ : ప్రజల అభిప్రాయం మేరకు అభివృద్ధి పనులు పంచాయితీ నిధులతో చేపట్టడం జరుగుతుందని ఏఎల్ పురం మేజర్ పంచాయతీ సర్పంచ్ లోచల సుజాత తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సభ మరియు పంచాయతీ సాధారణ సమావేశంలో గ్రామ ప్రజలు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి లో ఉంచుకొని పంచాయితీ నిధులతో అత్యవసర సిసి రోడ్లు కల్వర్టులు నిర్మించడం జరుగుతుందన్నారు అలాగే అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో కూడా చేపట్టడం జరుగుతుందని ఆమె తెలియజేశారు. అలాగే తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలందరూ ప్లాస్టిక్ వాటర్ బాటిల్ , చెత్త చెదారం వంటివి డ్రైనేజీ కాలువల్లో వేయకుండా వీధుల్లోకి వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందించి గ్రామ పరిశుభ్రకు , ప్రజల ఆరోగ్యానికి సహకారం ప్రతి ఒక్కరు అందించాలని ఆమె కోరారు.

వాడవాడలా ఘనంగా తెదేపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - సబ్బవరం : తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శనివారం తెలుగు దేశం నేతలు అధ్వర్యంలో నిర్వహించిన 43 వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ముందుగా పార్టీ జండా ఆవిష్కరణ చేసి , ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారు అంతే కాకుండా ఒక ప్రాంతీయ పార్టీ లోకసభలో ప్రధాన ప్రతిపక్షంగా నిలిపిన గణతకూడ ఆయనకే దక్కడం విశేషం. కుల మత ప్రాంతీయ తత్వాలకు అతీతంగా తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ రూపు దిద్దారని ఆయన కొనియాడారు. అనంతరం సీనియర్ నేతలను ఘనంగా దుస్సాలవాళ్ళతో సత్కరించారు. అలాగే అంతకాపల్లి పంచాయతీలో మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు మిడతాడు మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో 43వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు గండి వంశీదీప్, సీనియర్ నాయకులు భరిణికాన సాయినాథరావు, గండి దేముడు, కోటాన అప్పారావు, గండి ముత్యాలనాయుడు, రెడ్డి నారాయణరావు, బోండా సత్యారావు, గవర అప్పారావు, రోంగలి దేముడుబాబు, బోకం సత్యనారాయణ (కోకో కోలా డైలర్) , ఆదిరెడ్డి పోతురాజు ,కొరాడ శ్రీనివాసరావు, అక్కిరెడ్డి దుర్గినాయుడు ,పల్లా తాతారావు, బర్ల రమణ , సబ్బవరపు నరసింహమూర్తి ,పెద్దాడ రమణమ్మ, ఎం. అక్కుబాబు, దాడి కన్నంనాయుడు, పల్లా సన్యాసరావు, తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: తెలుగుదేశం పార్టీ43 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా జీవీఎంసీ పరిధి 88వ వార్డు వెదుళ్ళనరవలో తెలుగుదేశం పార్టీ43 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహం దగ్గర ఘనంగా నిర్వహించారు. 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్టీఆర్

విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లు అర్పించారు,ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి వురుకూటి శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు బలిరెడ్డి అప్పలరాజు, సీనియర్ నాయకులు దిల్లేశ్వర రావు గారు, రాజాన పైడి రాజు, మాడిస నర్సింగరావు,తెలుగు దేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, కూటమి నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని కింతాడ పంచాయతీ పరిధి కూండ్రపువాని పాలెంలో శనివారం తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవంను ఘనంగా చేశారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకులు సర్గీయ నందమూరి తారక రామారావు చిత్ర పటానికి టీడీపీ కింతాడ గ్రామకమిటీ అధ్యక్షుడు,క్లస్టర్ ఇంచార్జి కన్నూరు సూర్యనారాయణ(కె.ఎస్.ఎన్) టీడీపీ నాయకుడు బండారు రవితేజపాత్రుడుతో కలిసి పూల మాలవేసి శ్రద్దాంజలి ఘటించారు. గొల్లలపాలెం టీడీపీ నాయకుడు జోగ దేముడు(కుల్లోడు)తో కలిసి సూర్యనారాయణ టీడీపీ జెండాను ఎగురవేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కన్నూరు అప్పలనాయుడు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం గురించి తెలిపారు. కన్నూరు సూర్యనారాయణ మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గంను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి పాటుపడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అడుగు జాడల్లో మనం నడిచి అటు పార్టీఅభివృద్ధికి, ఇటు ప్రజా సంక్షేమ కోసం పాటుపడాలన్నారు. మండల కేంద్రం కే కోటపాడులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

కోటవురట్ల: తెలుగుదేశం పార్టీ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు

మండలంలో వాడవాడలా తెలుగు తమ్ముళ్లు శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కైలాసపట్నంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు భీముని మాణిక్యాలరావు, కోటవురట్ల లో ఎంపీటీసీ పీవీ సూర్యారావు, జానకి హరిబాబు, పాములవాకలో తెదేపా సీనియర్ నాయకులు జనార్ధన్, భాస్కరరావు, బి.కె. పల్లిలో సర్పంచ్ లింగమ నాయుడు, గొట్టివాడలో సుంకర బాబ్జి, రాజుపేట లో సర్పంచ్ వెంకటరమణ, కే. వెంకటాపురంలో మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, రామచంద్రపాలెం లో మాజీ సర్పంచ్ నంబరు రాంబాబు, అన్నవరం, కొడవటిపూడి, నీలిగుంట, లింగాపురం,పందూరు, రామచంద్రపురం, జల్లూరు, తంగేడు, మండలంలో వాడవాడలా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి తెదేపా ఆవిర్భవ దినోత్సవ వేడుకలను ఘన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

యలమంచిలి : నియోజకవర్గ కేంద్రం యలమంచిలిలో శనివారం తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అటల్ టీడీపీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు పార్టీ శ్రేణులతో కలిసి ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. పార్టీ జెండాను ప్రగడ నాగేశ్వరరావు ఆవిష్కరించారు అనంతరం కేక్ కట్ చేసి ఎన్టీఆర్ జోహార్ అంటూ నినదించారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆనాడు ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని తీసుకువచ్చిన మహోన్నతుడు స్వర్గీయ ఎన్.టి. రామారావు అని అన్నారు. తన నటనతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఎన్టీఆర్ రాజకీయ పార్టీ స్థాపించి ప్రజా రంజక పాలన చేసి ప్రజల ఆరాధ్యదైవం గా నిలిచారన్నారు. పేదలకు కూడు గూడు గుడ్డ కల్పించడంతోపాటు కల్పించడంతోపాటు కిలో రెండు రూపాయలకే బియ్యం కాలనీ ఇల్లు నిర్మాణం మహిళలకు ఆస్తి హక్కు వంటి సంస్కరణల తీసుకువచ్చా రన్నారు. అదే స్ఫూర్తితో టిడిపి పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు దేశంలోనే పాలనాదక్షకునిగా పేరుగాంచారు అన్నారు. టిడిపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం రాష్ట్ర ప్రజలంతా పండుగ వాతావరణంలో జరుపుకోవాలని గొప్ప విషయం అన్నారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరుగా సైనికులే కార్యకర్తలుగా ముందుకు సాగుతుందని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ పప్పుల చలపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు అమలు చేస్తున్న పథకాలు తీరు అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జి నానాజీ, కార్యదర్శి ఆదారి రమణబాబు, గ్రామీణ అధ్యక్షులు ఇతంశెట్టి రాజు, టిడిపి సీనియర్ నాయకులు కొలకలూరు విజయబాబు, కొట్టారు సాంబ, రాజన్న నారాయణమ్మ, ఆదారి ఆదిమూర్తి, సురకాసుల

రమణ బాబు, కరణం రవి, సర్పంచ్ సన్యాసినాయుడు, పందూరి శ్రీను, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ

దినోత్సవాన్ని మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు క్యాంప్ కార్యాలయం వద్ద జెండా ఎగరవేశారు. టిడిపి మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో నక్కపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద జెండా ఎగరేసి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు కి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగు దపాలుగా ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రానికి ఎనలేని సేవ చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అటువంటి పార్టీలో మనమందరం రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో కష్టపడి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు కురందాసు నూకరాజు కొప్పిశెట్టి కొండబాబు కొప్పిశెట్టి బుజ్జి వైబోయిన రమణ వెలగా శ్రీను గింజల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరం : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు .మండలంలో వెంకటాపురం గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, తిమ్మాపురంలో టిడిపి సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, కొత్త పోలవరం గ్రామంలో సీనియర్ నాయకులు

ఎస్ .వెంకటరాజు, పెట్టుగోళ్లపల్లి లో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కొత్త పోలవరంలో మంచినీటి సరఫరా చేసే ట్యాంకర్ ను ఎస్.వెంకట రాజు ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో వంగలపూడి గోవిందు మరిసా త్రిమూర్తులు ముప్పిన శ్రీను అమలకంటి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వి. మాడుగుల : టీడీపీ ఆవిర్భావంతోనే సామాజిక న్యాయం

వచ్చిందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం మాడుగులలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..బడుగు బలహీన వర్గాల కోసం స్వర్గీయ ఎన్టీఆర్ పార్టీని స్థాపించారన్నారు. ప్రజల్లో ఎన్టీఆర్ ఎప్పుడు నిలిచే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వుప్పాల అప్పలరాజు, వివిజి.కుమార్, మండల పార్టీ ప్రెసిడెంట్ జగ్గారావు, మాడుగుల టౌన్ ప్రెసిడెంట్ రంజిత్ వర్మ, ఉండూరు దేవుడు, సన్యాసిరావు, పెంటకోట జగన్నాధరావు, కాశి బాబు, పంచాయతీ ఉపాధ్యక్షులు గుమ్మాల గోవిందం, టిడిపి పార్టీ ప్రెసిడెంట్ కొయ్యన్ రమణ, మాజీ సర్పంచ్ మండల పార్టీ ఉపాధ్యక్షులు బుద్దాల రమణ తదితరులు పాల్గొన్నారను.

మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర-అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం తరుపున జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గలవేగి వీధి కర్రీ రమేశ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం జరిగిన 'ఇఫ్తార్ విందు' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసమని, రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ఓర్పు, సహనం ప్రతీ ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నది రంజాన్ ఉపవాస దీక్షల ప్రధాన సందేశమన్నారు. మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నాదని , వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఇమామ్ మరియు మౌజాన్ లకు 6 నెలల గౌరవ వేతనం విడుదల చేశామన్నారు. ముస్లిం యువత కోసం ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష కోసం డి ఎస్సి కోచింగ్ కోసం ఉచితంగా విశాఖపట్నం లో ఏప్రిల్ 6 నుండి శిక్షణ ఇవ్వనున్నట్లు కావున పోటీ పరీక్షలకు సన్నద్ధాం అయ్యే ముస్లిం అభ్యర్థులు ఈ అవకాశన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్ష చేసిన చిన్నారులతో, ముస్లిం మత పెద్దలతో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అనకాపల్లి, యలమంచిలి శాసనసభ్యులు కొణతల రామకృష్ణ, సుందరాపు విజయ కుమార్ తో కలిసి 'ఇఫ్తార్' విందులో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా ముస్లిం సోదరులు ఇఫ్తార్ ఉపవాస దీక్ష విరమించి, నమాజు ప్రార్థనలు చేశారు. అలాగే ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక దువా ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ. పోలీస్ డిపార్ట్మెంట్ తరుపున ముందుగా ముస్లింల అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందిస్తాయన్నారు. ముస్లింల భద్రత పై ప్రత్యేక శ్రద్ద తీసుకుంటున్నా మని, జిల్లాలో ముస్లిం యొక్క రక్షణ కోసం 24 గంటలు నిమగ్నమై ఉంటామని అయన తెలిపారు. అనకాపల్లి శాసనసభ్యులు కొణతల రామకృష్ణ మాట్లాడుతూ ముందుగా ముస్లిం సోదరలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ రంజాన్ మాసంలో చేసే ఉపవాస దీక్ష ద్వారా మానసిక, శారీరక పవిత్రత చేకూరుతుందన్నారు. మైనార్టీల సంక్షేమంతో పాటు వారి అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుదు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రస్తుతం మసీదుల మరమ్మతులకు మరియు షాదీ ఖానా నిర్మాణం, బరియల్ గ్రౌండ్ ప్రహరీ గోడ నిర్మాణాలు కోసం నిధులు మంజూరు చేయటానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యన్నారాయణ రావు, అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎం సత్య పద్మ, రాష్ట్ర ఆర్థిక మౌలిక వసతుల కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందా సత్యనారాయణ, జామా మషీద్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి ఎస్ ఎన్ హుస్సేన్, కార్యదర్శి ఎం.డి.జిలాని, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శిథిలమైన తుపాను షెల్టర్లు తొలగించరా?

- హెూం మంత్రి ఆదేశాలు కూడా పట్టించుకోరా?

- మండల పరిషత్ సమావేశంలో అధికారులను నిలదీసిన సర్పంచ్‌లు వంకా వెంకటరమణ, గారా కృష్ణప్రసాద్

విశాలాంధ్ర-పాయకరావుపేట : ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో శిథిలమైన తుపాను షెల్టర్లు తొలగించాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా తొలగించేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదని, హెూం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు జారీ చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని మండలంలోని వెంకటనగరం సర్పంచ్ వంకా వెంకటరమణ అధికారులను నిలదీశారు. శిథిలమైన తుపాను షెల్టర్లు కూలిపోయి విద్యార్థులకు జరగకూడని ప్రమాదం జరిగితే విద్యాశాఖ అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరించారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపిపి ఇసరపు పార్వతి అధ్యక్షతన జరిగింది. వెంకటనగరం సర్పంచ్ వంకా వెంకటరమణ, శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ అధికారులపై సమస్యలు, ప్రశ్నల వర్షం కురిపించారు. గ్రామాల్లో లోఓల్టేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మత్స్యకారులు సాగులో ఉన్న భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని సర్పంచ్ వంకా వెంకటరమణ డిమాండ్ చేశారు. రౌడీషీటర్లు, భూకబ్జాదారులు పెరిగిపోయారని తెలిపారు. శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మండలంలో పనిచేస్తున్న అధికారుల తీరు పట్ల నిరుత్సాహం వ్యక్తం చేశారు. శ్రీరాంపురం గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తాండవనదిలో, ముఠాకాలువలో తుని మున్సిపాలిటీ చెత్త తీసుకొచ్చి వేస్తుంటే ఇరిగేషన్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం

లేదని ప్రశ్నించారు. ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమించుకుంటూ పోతే, పేదలకు ఇళ్ల స్థలాలు వేరే గ్రామాల్లో ఇస్తున్నారని తెలిపారు. అలాగే పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు ఆయా గ్రామాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఎంపిడీఓ జయప్రకాశరావు, వైస్ ఎంపిపి ధనిశెట్టి మాధవి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్చకులకు ఉగాది కానుకగా వస్త్రాలు పంపిణీ

ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి "డివిడి ప్రసాద్"

విశాలాంధ్ర - గొలుగొండ : ఉగాదిని పురస్కరించుకుని కొయ్యూరు గొలుగొండ మండలాల ఆలయ అర్చకులకు దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నూతన వస్త్రాలు అందజేయడం జరిగింది అని ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ తెలిపారు. శనివారం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో గల వీరబ్రహ్మం ఆలయం వద్ద జోగుంపేట, చిట్టెంపాడు నుండి వచ్చిన ఆలయ అర్చకులు 150 మందికి ఈ నూతన వస్త్రాలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్స్ సంఘం అధ్యక్షుడు తామరపల్లి శివ, బాబురావు, శ్రీను, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లి రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిసిన పి.బి.వి.ఎస్.ఎన్.రాజు

విశాలాంధ్ర -సబ్బవరం: అనకాపల్లి పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఉమ్మడి విశాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రి కొల్లి రవీంద్రను అనకాపల్లి పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షులు పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన కు పుష్ప గుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కరక దేముడు, కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ నూకాలమ్మ తల్లి పండగ మహోత్సవం

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు పెదనాయుడుపాలెం, గుల్లేపల్లి, జీవీఎంసీ పరది 88 వార్డ్ కోటనరవ గ్రామాలలో కొత్త అమావాస్య పర్వదినం సందర్భంగా గ్రామ పంచాయతీ ప్రజలు కొంగు బంగారం మరియు ఇలవేల్పు శ్రీ నూకాలమ్మ తల్లి పండగ మహెూత్సవం ఆయా ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ ,పెందుర్తి నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులు గండి రవికుమార్ అమ్మవార్లకి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవార్ల ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలు అందరి పై ఉండి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు ఆయనతో సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ ధిడ్డం ప్రసాద్ రావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, వైస్సార్సీపీ మండల అధ్యక్షులు కర్రి బాబు, మాజీ ఉప సర్పంచ్ సబ్బవరపు నాగేంద్ర, సిరికి దేవుడు, దాడి నూకరాజు, మళ్ల రమణ, సతీష్, నూక అప్పారావు ,యడ్ల నాయుడు, సిరపరపు వాసు, సబ్బవరపు నాగభూషణం, వార్డ్ మెంబర్లు గొర్లి శ్రీను, ఎస్. రామకృష్ణ, పల్లా కృష్ణ, గండి సన్యాసిరావు, గంద్రెడ్డి మహాలక్ష్మి నాయుడు, దాడి నూకరాజు,మళ్ళ రమణ,సతీష్,వంగాలపూడి గణేష్,కోన శ్రీనివాస్, దన్నిరెడ్డి శ్రీనివాస్ మరియు గండి రవికుమార్ యువ సైన్యం పాల్గొన్నారు.

యస్.రాయవరం : మండలంలో కొత్త అమావాస్య పండుగ ఘనంగా జరిగాయి. తిమ్మాపురం వాకపాడు పెనుగొల్లు గుడివాడ తిమ్మాపురం ఎస్. రాయవరం తదితర గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి ఆలయాలకు భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. తిమ్మాపురం గ్రామంలో అమ్మవారిని సిఐ ఎల్ .రామకృష్ణ మండల టిడిపి అధ్యక్షుడు అమలకంటి అబద్ధం , టిడిపి సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, గుడివాడ గ్రామంలో నూకంబిక అమ్మవారిని టిడిపి సీనియర్ నాయకులు ఎన్. వెంకట్రాజు దర్శించుకున్నారు.

చోడవరం : చోడవరం పట్టణం దుడ్డు వీధిలో వేంచేసి ఉన్న ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీ నూకాలమ్మ తల్లి కొత్త అమావాస్య జాతర, ఉత్సవ వేడుకలు శనివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుండి అమ్మవారికి శ్రీ సూక్త పూర్వకముగా పసుపు కుంకుమ, పంచామృతములతో అభిషేకములు శాస్త్రోక్తముగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖుల్లో స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, సీనియర్ సివిల్ జడ్జి తదితరులు ఉన్నారు. పూర్వీకుల కాలం నుండి దియ్యా వంశీకులు చేతులు మీదుగా అమ్మవారు పండుగ, ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడి సాంప్రదాయం. చోడవరం చుట్టుపక్కల 40కు పైగా గ్రామాల నుండి భక్తులు విచ్చేసి నూకాలమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడం అలనాటి సాంప్రదాయం. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆలయ నిర్వహకులు స్వర్గీయ దియ్యా నారాయణ స్వామి కుమారుదు వర్మ తెలిపారు. మండలంలోని దామునాపల్లి, లక్కవరం తదితర గ్రామాల్లో నూకాల అమ్మవారి కొత్త అమావస్య పండుగను ఘనంగా నిర్వహించారు.

కోటవురట్ల : కొత్త అమావాస్య సందర్భంగా కైలాసపట్నం గ్రామంలో నూకాలమ్మ తల్లి జాతర మహెూత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి తెల్లవారులు అమ్మవారిని గ్రామం పురవీధుల్లో ఊరేగించి జాగారం చేశారు. శనివారం ఉదయం మహిళలు యువకులు గ్రామ పుర ప్రజలంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ వెలుగులతో సుందరంగా అలంకరించారు. మందు గుండు సామాగ్రి భారీ స్థాయిలో పేల్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

యలమంచిలి : కొత్త అమావాస్య పురస్కరించుకుని శనివారం నాడు పట్టణంలో నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో భక్తులు దర్శనాల కోసం పోటెత్తారు. ఉదయం 5 గంటల నుండి అమ్మవారి గుడి వద్ద భక్తులు బారులు తీరి పసుపు, కుంకుమ, చీర, రవిక సమర్పించుకొని మొక్కులు తీసుకున్నారు. ఈ

సందర్భంగా అమ్మవారి గుడికి వచ్చే భక్తులకు ఎండ దెబ్బ తగలకుండా టెన్ట్ ఆలయ కమిటీ వాళ్ళు నిర్వహించగా మజ్జిగ చలివేంద్రాలు ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ గురించి శిష్య బృందం, సత్యసాయి సమితి వారు నిర్వహించి ప్రజలకు దాహత్తని తీరుస్తున్నారు. ప్రసాద వితరణ నడిగట్ల ప్రదర్శన ఏర్పాటు చేసి భక్తులకు అందజేస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ వారు, టౌన్ పోలీసులు రక్షణ కల్పిస్తున్నారు.

సంఘ అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలి

విశాలాంధ్ర-చీడికాద : సంఘం అభివృద్ధికి సభ్యులు, రైతులు కృషి చేయాలని పర్సన్ ఇంచార్జ్ కె రామ రత్నం అన్నారు మండలంలో దండి సురవరం పిఎసిఎస్ మహాజన సభ శనివారం నిర్వహించారు. సంఘం లాభ నష్టాల నివేదికను కంప్యూటర్ ఆపరేటర్ సభ్యు రైతులకు చదివి వినిపించారు ఈసందర్భంగా మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు బొబ్బాది తాతారావు మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను తొమ్మిది లక్షలు ఆదాయం ఉండేదవి ఆ సొమ్ము దేనికి ఖర్చు పెట్టారని అడిగారు జిల్లాలో లాభాల్లో ఉన్న పిఎ సి ఎస్ లలో దండిసురం ఒకటి అన్నారు చోడవరం సెంట్రల్ బ్యాంకు సంఘం ద్వారా రుణాలు 40 లక్షల వరకు చెల్లించారన్నారు సెంట్రల్ బ్యాంక్ ద్వారా రైతులకు డివిడెంట్ ఎంత వచ్చిందో చెప్పాలని కోరారు కంప్యూటర్ ఆపరేటర్ సమాధానం ఇస్తూ సిబ్బంది జీతాలకు సంవత్సరానికి 10 లక్షలు ఖర్చు అవుతుందని సెంట్రల్ బ్యాంక్ నుండి డివిడెంట్ రూపంలో సంఘానికి 2 లక్షల29 వేలు వచ్చిందన్నారు ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పిల్లా కృష్ణారావు వివిధ పార్టీ నాయకులు సభ్య రైతులు పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

విశాలాంధ్ర-రాంబిల్లి : రాంబిల్లి మండలం పాస్టర్స్ ఫెలోషిప్, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో, మండల అధ్యక్ష కార్యదర్శులైన జేమ్స్, జాషువా రాయి ఆధ్వర్యంలో ప్రవీణ్ పగడాల మరణానికి నిరసనగా శనివారం రాంబిల్లిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతికి కారకులైన దోషులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని, మైనారిటీలైన క్రైస్తవులలో నెలకొన్న భయభ్రాంతులను వెంటనే తొలగిపోయే లాగా ఈ కేసును తాత్సారం చేయకుండా సమగ్ర విచారణ జరిపి వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.వీరికి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జి దేముడు నాయుడు, మండల కమిటీ సభ్యులు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. మైనార్టీ మతస్థులకు రక్షణ కల్పించాలని, మతోన్మాద దాడులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ రాంబిల్లి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టి, మండల తాశీల్దార్ శ్రీనివాస్ కి, వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న పాస్టర్స్, వీ కాలేబు, సుధీర్ కుమార్, కృపారావు, పీటర్, సైమన్ పీటర్, రాజా పిన్నాస్ తదితరులు పాల్గొన్నారు.